
ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 29 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 2 pm

# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం



**టాలీవుడ్ , ప్రజాస్వరం**

నటుడు అల్లు శిరీష్ వివాహం మార్చి 6న జరగనుంది. నయనికతో అక్టోబర్ లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఇన్ స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్ , అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ – స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. శిరీష్ –నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్ – లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

## గల్ఫ్ బాధితుల కోసం

# ప్రత్యేక మంత్రిత్వ శాఖ

**అక్కడ కార్మికుల పరిస్థితులు దుర్భరం**

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



హైదరాబాద్ , ప్రజాస్వరం

గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్ లో ఆయన మాట్లాడారు. మన ఊరు–మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

రాజకీయ జోక్యం పెరుగుతోంది : కూనంనేని

శాసనసభ జీరో అవర్ లో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. "సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ జోక్యం పెరుగుతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రస్తుతం కూడా అవే కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముంది" అనీ అన్నారు.

# కేసీఆర్ బాగున్నారా..

## సభ ప్రారంభమైన తర్వాత ఆయన వద్దకు సీఎం రేవంత్

## మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతా?

## విలేకరుల ప్రశ్నకు బదులు

## ప్రతి సభ్యుడిని గౌరవిస్తాం : సీఎం రేవంత్

**హైదరాబాద్: కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. "ప్రతి సభ్యుడిని మేం గౌరవిస్తాం. కేసీఆర్‌ను ఇవాళే కాదు.. ఆస్పత్రిలో కూడా కలిశా. అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో ఆయన్నే అడగాలి" అని రేవంత్ అన్నారు. ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతాం? అని సీఎం వ్యాఖ్యానించారు. శాసనసభ ప్రారంభమైన తర్వాత కేసీఆర్ వద్దకు రేవంత్ వెళ్లారు. కరచాలనం చేస్తూ బాగున్నారా అని సీఎం పలకరించారు.**



## రాజకీయ ప్రత్యర్థులు

# పలకరింపు మంచిదే"

**ముఖ్యమంత్రి సభలో కేసీఆర్ ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు**

**ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది**

**రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టం**

**సీఎం రేవంత్ తిట్లు నాకు దీవెనలు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, ప్రజాస్వరం

రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్ ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు అని అన్నారు.. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుందన్నారు. పాలమూరు–రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారన్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు, నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్ ను అంటే ఊరుకునేది లేదన్నారు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు–రంగారెడ్డి పనులు చేయట్లేదన్నారు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారు అని కేటీఆర్ అన్నారు.

**మాజీ సీఎం కేసీఆర్ ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. "తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉందన్నారు.. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్ ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు అని అన్నారు.. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుందన్నారు.. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.**



పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "బీఆర్ఎస్‌ను కాదని బీజేపీలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారన్నారు.. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయన్నారు.. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదన్నారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదన్నారు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## అమెరికాలో

# రోడ్డు ప్రమాదం



**మహబూబాబాద్ జిల్లా గార్ల కు చెందిన ఇద్దరు అమ్మాయిలు మృతి**

**లోయలో పడిన కారు**

**వాషింగ్టన్, ప్రజాస్వరం**

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్ కి బయల్దేరారు. అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# హరీశ్‌రావు VS శ్రీధర్‌బాబు

**ఆరు డీఏలు పెండింగ్**

**పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి : హరీష్**

**ఉద్యోగుల గురించి హరీష్ మాట్లాడటం విడ్డూరం**

**దెయ్యాలు వెదలు వల్లించినట్లుంది**

**సభ్యుల విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకుంటాం**

**మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని ప్రభుత్వానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు బెనిఫిట్స్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఎన్నికల్లో ప్రభుత్వోద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినంక గాలికి వదిలేశారని మండిపడారు. ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని కోరారు. పింఛన్ బకాయిలు రావట్లేదని 39 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారని వెల్లడించారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇస్తూ... ఉద్యోగుల గురించి హరీశ్ రావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హరీశ్ రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని చమత్కరించారు. సభ్యులు విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకుంటామని శ్రీధర్ బాబు సూచించారు. గత బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారని మంత్రి వెల్లడించారు.

